# ఎన్నికలు - తనిఖీలు

## ఎల్బీ నగర్‌లో రూ. 28.99 లక్షలు పట్టివేత



ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ అంజిరెడ్డి తదితరులు

మన్సూరాబాద్ : ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. ఆరుగురు వ్యక్తులు వేర్వేరు వాహనాల్లో అనధికారికంగా తరలిస్తున్న రూ.28,99,640 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చింతలకుంట క్రాస్ రోడ్డు, ఎస్‌బీహెచ్‌కాలనీ, సాగర్ రింగ్‌రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. చింతలకుంట క్రాస్ రోడ్డులో దినేశ్‌సింగ్ ఠాగూర్ వద్ద రూ.3.62 లక్షలు, ఎస్‌బీహెచ్ కాలనీలో కటకం లెనిన్‌బాబు వద్ద రూ.1.80 లక్షలు, చింతలకుంట క్రాస్ రోడ్డులో ముఖేశ్ పాండే వద్ద రూ.13,58,640, చింతలకుంట క్రాస్ రోడ్డులో వెదిరె అశోక్ వద్ద రూ.3 లక్షలు, చింతలకుంట క్రాస్ రోడ్డులో దంతులూరి అరుణ్‌రాజు వద్ద రూ.4,69,500, సాగర్ రింగ్‌రోడ్డు వద్ద కమోదుల అజయ్‌కుమార్ వద్ద రూ.2,29,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



బోరబండ పోలీసులు సీజ్ చేసిన నగదు

- **జవహర్‌నగర్:** జవహర్‌నగర్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.6 లక్షలు సీజ్ చేశారు.
- **మెహిదీపట్నం :** హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.6.95 లక్షలు పట్టుబడ్డాయి.
- **మియాపూర్:** మియాపూర్ ఠాణా పరిధిలోని హఫీజ్‌పేట్ జెన్ ప్యాక్ సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో ఓ వ్యక్తి వద్ద రూ.8.63 లక్షల నగదు లభించింది.
- **ఎర్రగడ్డ :** బోరబండ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.5 లక్షలు లభించాయి.
- **కొండాపూర్ :** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో శుక్రవారం రూ.2,76,000 నగదు పట్టుబడింది.
- **ముషీరాబాద్ :** ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.9.5 లక్షలు లభించాయి.
- **ఘట్‌కేసర్ రూరల్:** పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.5 లక్షలు లభించాయి. అదేవిధంగా.. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మరో వ్యక్తి వద్ద కూడా రూ.3 లక్షలు లభించాయి.
- **చర్లపల్లి :** కుషాయిగూడ, చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన తనిఖీల్లో దాదాపు రూ. 8 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

## బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మరు

- మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యం
- నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

మేడ్చల్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని, ప్రజల ఆశీర్వాదంతో మూడవ సారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మల్కాజిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం ప్రత్యేక ఇన్‌చార్జిగా బీఆర్‌ఎస్ అధిష్ఠానం నియమించినందున శుక్రవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజలకు పూర్తి నమ్మకం ఉన్నదని, బీఆర్‌ఎస్ పార్టీని ఇంటి పార్టీగా ప్రజలు చూస్తున్నారని తెలిపారు. తొమ్మిదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మె పరిస్థితిలో లేరని, మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యమని అన్నారు.

## ఎన్నికల అనుమతులకు సువిధ యాప్

### సులభతర పద్ధతులను అమల్లోకి తెచ్చిన ఎన్నికల అధికారులు




సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ ) : శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ నవంబరు 3వ తేదీ నుంచి మొదలవుతుంది. ఈ నామినేషన్ల ప్రక్రియలో గుర్తింపు పొంది రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుంచి అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు సులభమైన పద్ధతిలో ''సువిధ యాప్'' ద్వారా అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మీటింగ్, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎలక్షన్ ఆఫీస్, లౌడ్ స్పీకర్, హెలికాప్టర్, హెలిప్యాడ్, డోర్ టు డోర్ ప్రచారం, డిస్‌ప్లే బ్యానర్స్, బారికేడ్లు ఫ్లాగ్స్ అనుమతులకు సులభతరంగా ఒకే చోట 48 గంటలలో అనుమతులు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించింది. అనుమతి పొందిన 72 గంటల పాటు వాలిడ్ ఉంటుంది. ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ ఆఫీస్‌లో ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయాల వద్ద నియోజకవర్గం నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న ఏఎస్‌పీ స్థాయి అధికారిని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నియమించనున్నారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా అనుమతులు పారదర్శకంగా జారీ చేస్తారు.

## టీ వర్క్స్‌లో కలామ్ లెగసీ హ్యాకథాన్

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : టీ వర్క్స్, ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ కలామ్ లెగసీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని టీ వర్క్స్ సీఈఓ సుజయ్ కారంపూరి అన్నారు. ఈ నెల 11నుంచి మొదలై 15 వరకు నిర్వహించే హ్యాకథాన్‌లో తెలంగాణ నుంచి 60 బృందాలు ఈవెంట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని, ఇందులో యువ ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి, పరిశ్రమల ప్రముఖుల నుంచి నేర్చుకోవడానికి ఆసక్తిని కనబర్చారని తెలిపారు. దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సలహాదారు డాక్టర్ వి.పోన్‌రాజ్, టీ హబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి, ఐఈఈఈ ఆర్‌ఏఎస్ హైదరాబాద్ చైర్మన్ గుల్షన్, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

## 1800 425 2050 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

### వివరాలు గోప్యంగా ఉంచుతాం

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**



మేడ్చల్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2050 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌకర్యార్థం ఏమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. డబ్బులు పంచినా, ప్రలోభాలకు గురిచేసినా.. వెంటనే సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## లాస్య నందితను భారీ మెజారిటీతో గెలిపించాలి

- మంత్రి తలసానితో భేటీ అయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత
- ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నేతలకు మంత్రి దిశా నిర్దేశం



వెస్ట్ మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో తలసానితో సమావేశమైన కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత, బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్, అక్టోబర్ 13 : కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం బోర్డు సభ్యులతో కలిసి లాస్యనందిత మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేశారని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆయన కుమార్తె లాస్య నందితకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారని చెప్పారు. లాస్య నందిత గెలుపు కోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్ రూమ్ ఏర్పాటు, పాదయాత్రలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. గులాబీజెండాను రెపరెపలాడించి, కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని చాటిచెప్పాలని మంత్రి తలసాని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథం, సీనియర్ నాయకులు ఆకుల హరికృష్ణ, టీఎన్ శ్రీనివాస్, సంతోష్ యాదవ్, పార్టీ నాయకురాలు నివేదిత పాల్గొన్నారు.

## పెయిడ్ న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఉప ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి




సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) :వార్తా పత్రికలు, కేబుల్ చానెల్‌లో వచ్చే పెయిడ్ న్యూస్‌ను జాగ్రత్తగా ఎప్పటికప్పుడు రికార్డ్ చేయాలని హైదరాబాద్ జిల్లా ఉప ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని సందర్శించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వార్తలను జాగ్రత్తగా పరిశీలించి అవి పెయిడ్ న్యూస్ అని తెలిసిన వెంటనే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం కోసం 1950 కాల్ సెంటర్‌ను సందర్శిస్తే.. వెంటనే సమాధానం ఇవ్వాలని సూచించారు.

## నేడు టీ హబ్‌లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

సిటీబ్యూరో, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ) : వివిధ అంశాల్లో నైపుణ్యం కలిగిన నిపుణులను నియమించుకునేందుకు శనివారం టీ హబ్‌లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని టీ హబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో పాటు ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొనవచ్చన్నారు. నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసుకొని ఉద్యోగాల్లో నియమించుకునేందుకు ఇది మంచి వేదికని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు టీ హబ్ వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

## టీ హబ్‌తో కెనడా యాక్సిలరేటర్ సెంటర్ భాగస్వామ్యం

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : కెనడా, యూఎస్‌ఏలలో భారతీయ స్టార్టప్‌ల వృద్ధి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా టీ హబ్‌తో కలిసి కెనడా యాక్సిలరేటర్ సెంటర్ ప్రత్యేకంగా కార్యక్రమాన్ని చేపట్టింది. భారతీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ మార్కెట్‌ను సులభతరం చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేలా ఈ కార్యక్రమం ఉంటుందని టీ హబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. యాక్సిలరేటర్ సెంటర్ సీఈఓ జె.కృష్ణన్ మాట్లాడుతూ గ్లోబల్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడంలో మంచి అనుభవం ఉందని, టీహబ్‌తో కలిసి పనిచేయడం స్టార్టప్‌లను మరింత ఉన్నత స్థితికి తీసుకువెళ్లడానికి దోహదపడుతుందన్నారు.

## సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

### నేడు ఆర్వోలు, నోడల్ అధికారులకు శిక్షణ

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) :రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో నియమించిన ఆర్వోలు, నోడల్ అధికారులు, నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బందికి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో శనివారం ఉదయం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. నామినేషన్ సందర్భంగా ఆర్వోల పాత్ర, పాటించాల్సిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అనుమతులు ఇతర అంశాలు, ప్రత్యేక అధికారి విధులు, బాధ్యతలు, నోడల్ అధికారుల విధుల గురించి వివరించనున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శిక్షణ సందర్భంగా ప్రతి అంశాలను క్షుణ్ణంగా అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) శంకరయ్య, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, మ్యాన్‌పవర్ నోడల్ అధికారి వెంకటరెడ్డి, పీడీ విజయలక్ష్మి, ఎలక్ట్రికల్ ఈఈ మమత తదితరులు పాల్గొన్నారు.